# గోదారమ్మ-8

"నీ సందేహానికి ఏం సమాధానం చెప్పాలో నాకే తెలియడంలేదు సీతా! నా నమ్మకం మాత్రం ఏమిటంటే... గుడిలో అయినా రద్దీ గోలలో నిలబడి దేముడి దర్శనం చేసుకోవటం కంటే... ఆ గుడి ఆవరణలో కాసేపు ప్రశాంతంగా కూర్చోవటం మాత్రం బావుంటుంది. ఆపైన పెద్దాయన చెప్పే ప్రవచనాలు వినటమూ ఇష్టమే... నాలుగు మంచి మాటలు తరచూ చెవిని బడటం వలన మన జీవిత విధానమూ మార్పు చెందుతుందని నేను అనుకుంటాను!

అక్కడికి వచ్చేవాళ్ళను పరిశీలించి చూడటం, నాలాగే కాసేపు కూర్చునే వాళ్ళతో కష్టం, సుఖం మాట్లాడుకుంటున్నట్లుగా మాటలు కలపటమూ బాగానే ఉంటుంది. అప్పుడప్పుడూ అలాంటి కాలక్షేపం కబుర్లతోనే ఒకరి సమస్యలకు మరొకరం తోచిన సలహాలను పరిష్కారమార్గాలుగా చెప్పుకోవటమూ జరుగుతూంటుంది! ఇదీ నాకు నచ్చిన కాలక్షేపం అర్థమైందిగా...?

ఇక ఆస్తికత్వమూ, నాస్తికత్వమూ గురించి వాదనలు, చర్చలూ అనవసరమనిపిస్తుంది! భగవంతుడు లేడనుకోవటంలో లాభమేమీలేదు. అలాగే ఉన్నాడనుకోవటంలో నష్టమూ లేదు. కాకపోతే మూఢభక్తి, మూఢాచారాలను ఎవరమైనా ఒప్పుకోలేం. కానీ దైవభక్తి, పాపభీతి... సామాన్య జనాలకు చాలా అవసరం! ఆ భావన మనుషులను మంచి మార్గాన నడిపించటానికి కొంతవరకూ ఉపయోగపడుతుంది! అందుకే మతమన్నది మనిషికి అవసరంగా మారిందనుకుంటా! ఏమతం అయినా సరే... చెప్పేది ఒక్కటే... మనిషి హితం! అవునా...? అయినా కొందరు జనం ఎందుకిలా మతాల పేరిట కొట్టుకు చస్తారో అర్థంకాదు! అన్ని మతాలూ ఒక్కటే కదా అనుకుని మంచి మార్గంలో నడవమనే కదా మత పెద్దలు బోధించినదీ...! ఏ మతంలో ఉంటేనేం... ఎందుకలా అనుకోరో...మరి?

సరేలే... మనకు అర్థంకాని విషయాల జోలికి పోకుండా... మన చేతనైనంతలో మన చుట్టుపక్కల ఉన్నవాళ్ళకి చేయగలిగిన సాయం చేస్తూ.... ఆనందంగా బ్రతికేయటమే మనం చేయగలిగిన పని అంతేకదూ....?

సీతా... ఇంకో మాట, డబ్బున్నది మాత్రం ఎవరికైనా చేతిలో ఉండటం చాలా ముఖ్యం. మనం చేయాలనుకున్న ఎన్నో పనులకు ఊతంగా పనికొస్తుంది! అందుకనే అందరూ కష్టపడి పనిచేయాలి. వీలైనంత పొదుపూ చేయగలగాలి! అవునా...!

ఏమిటో సీతా... నువ్వేదో అడిగావు... నాకు తోచినదేదో నేను చెప్పుకొచ్చాను అంతే! ఇది నా మనసుకు నచ్చిన ఆలోచనలు... ఇవే కరెక్టని చెప్పలేనుగానీ...'' అంటూ ఆవిడ నవ్వేసింది.

ఆవిడ వైపు కళ్ళు పెద్దవి చేసుకుని చూస్తున్న సీత క్షణంలోనే తేరుకుని చిరునవ్వుతో చెప్పింది.

''మీరు చెప్పిన మాటలు నాకు చాలా బాగా నచ్చాయమ్మా. నాకే కాదు...ఊరందరికీ నచ్చుతున్నాయి. ఈ మధ్య నేను ఎక్కడికి వెళ్ళినా... చూసినవాళ్ళు... 'మీ పెద్దమ్మగారు ఈ ఊరికిరావటం వలన ఎంతో మేలు జరిగిందమ్మా...! చాలా పెద్దమనసు ఆవిడది. ఎవరికి ఏం సాయం కావాలన్నా చేస్తారు... మంచి సలహాలనూ ఇస్తారు. మన వూరుకు నిజంగా పెద్ద దిక్కుగా ఉన్నారు!' అని అంటూవుంటారు! ఆ మాటలు విన్నపుడు నాకు చాలా ఆనందంగానూ, గొప్పగానూ ఉంటుందమ్మా...!''

''ఈ వూరు వాళ్ళంతా నా పట్ల అలాంటి ఆదరం చూపించటం నా అదృష్టం సీతా! ఇలా అందరితో కలిసి నాకు నచ్చిన విధంగా బ్రతకాలని కోరుకున్నాను! ఆ కోరిక తీరటం నాకు ఆనందం కలిగించే విషయం! చేతిలో కొంత డబ్బు ఉండటం వలనే ఇలా వీలవుతుందనుకుంటున్నా. అందుకే... అందరూ కష్టపడి సంపాదించిన దానితో భుక్తికి పోగా, ఎంతో కొంతయినా వెనకేయగలగాలని నేను చెప్పేది.''

ఆ మాటలకు సీత తలవూపుతూ ''అదేగదమ్మా నేనూ అనేది. మీ దగ్గరున్నది మీ అవసరం కోసం ఉంచుకోకుండా ఈ వూరివాళ్ళకోసం ఖర్చుపెట్టేస్తున్నారనే కదూ నా ఆరోపణా...'' అంది సీత.

''అదేం లేదు సీతా... నేను అవసరం అనుకున్న వాళ్ళకోసమే... కొంతలో కొంతగా ఖర్చు చేస్తున్నానంతే...! అయినా ఈ వయసులో... నాకోసమని పెద్దగా అవసరాలంటూ ఏం ఉంటాయి. చెప్పూ... ఏమైనా ఆరోగ్య అవసరాలకోసమే కదూ... అందుకోసం మాత్రం జాగ్రత్త చేసుకుంటున్నాలే...!'' అనేసింది గోదారమ్మ.

''అది కాదమ్మా నేననేది... నెలనెలా ఇంటికోసం అంటూ మీరు ఖర్చుచేయడం నాకు నచ్చటం లేదమ్మా...!" సీత మొహం నిష్ఠూరంగా పెడుతూ అంది.

''నా మాటా అదే.. నీ జీతం... జాగ్రత్త చేసుకోకుండా, నా కోసం కూడా నువ్వే ఎందుకలా ఖర్చు పెట్టాలీ...! అది నాకూ నచ్చదు మరి! ఆ పైన నేను చరమాంకంలోకి వచ్చేసాను. నీకు... జీవితం ముందు ఎంతో ఉంది. ... ఇద్దరు పిల్లలతో ఎన్ని ఖర్చులుంటాయి...''

ఆవిడ మాటలకు సీత ఆశ్చర్యంగా చూస్తూ ''ఏమిటమ్మా మీరు అంటున్నదీ...? ఇద్దరు పిల్లలు ఏమిటీ...?'' అంది.

గోదారమ్మ కూడా తెల్లబోయింది. తర్వాత తేరుకుని చిరునవ్వు నవ్వేసింది.

''ఏమిటో సీతా... ఏదో ఆలోచనలో ఉండి... పరాకుగా అలా మాట్లాడేసాను!'' అంది.

* * *

కాసేపటికి గుడిలో కూర్చున్న గోదారమ్మ తన పక్కనే కూర్చున్న పద్మావతమ్మతో ''పూర్ణను తీసుకువస్తానని చెప్పావుకదా... రానందా....?'' అనడిగింది అటూ ఇటూ చూసి.

పద్మావతి చిరునవ్వుతో చూసింది ''అదేమిటమ్మా అలా అడుగుతున్నారూ... అదిగో అక్కడ కూర్చుందిగా. కాకపోతే రోజూ కూర్చునే స్థలానికి ఇంకొంచెం దూరంగా కూర్చుంది!''

''అలా..... దూరంగా కూర్చున్న ఆ అమ్మాయా...?! రోజులా కాకుండా ఈవేళ ప్రత్యేకంగా కనిపిస్తుంటేనూ... పూర్ణ అనుకోలేదు... ఇంకెవరో అనుకున్నాను!'' అంటూ ఆవిడ చేయచాపి ఆ అమ్మయిని దగ్గరకు రమ్మన్నట్లుగా పిలిచింది.

ఆ అమ్మాయి వచ్చి కొంచెం దూరంగానే నిలబడి ''నన్నే పిలిచారండీ...?'' అని వినయంగా అడిగింది.

అవునన్నట్లుగా తలవూపిన గోదారమ్మ ''అలా దూరంగా కూర్చున్నావెందుకమ్మా... ఇలా కూర్చో... ఇక్కడ చోటు ఉందిగా...'' అంటూ తన పక్కన ఉన్న స్థలం చూపించింది.

ఆ అమ్మాయి నసుగుతూ ''వద్దులెండమ్మా... ఏదో కాలక్షేపానికి ప్రవచనాలు వినటానికని వస్తుంటాను. అలా అందరికీ దూరంగా కూర్చోవటం అలవాటయిపోయింది'' అంది.

''భలేదానివే...!'' అంటూ ఆవిడ మళ్ళీ అడిగింది. ''నిన్ను నేను ఈ రోజు అసలు గుర్తుపట్టలేకపోయా. ఇలా శుభ్రంగా... చక్కగా రోజూ కనిపించవచ్చుగా...?''

పద్మావతిని చూపిస్తూ పూర్ణ ఉత్సాహంగా చెప్పింది. ''ఈ రోజు ఈ పిన్నిపిలిచి... ఇలా జడవేసి తయారు చేశారమ్మా....!'' అంది.

గోదారమ్మ పద్మావతివైపు ప్రశంసగా చూసింది.

‘‘మట్టిలో ఉన్న మాణిక్యాన్ని తీసి బాగా మెరుగుపెట్టావు పద్మావతీ...! నీ చేతిలో మంచి నైపుణ్యం ఉంది! ఈ పూర్ణను నేను గుర్తుపట్టనేలేకపోయాను సుమా!’’

పద్మావతి కళ్ళు మెరిసాయి. ముసిముసిగా నవ్వింది.

‘‘అవునండీ... ఈ అమ్మాయి ఏమిటో సరిగా తల దువ్వుకోకుండా, ఎప్పుడో గానీ స్నానం కూడా చేయకుండా వాళ్ళింటి వరండాలో ఓ మూల పడి వుంటూ... ఇంట్లో వాళ్ళు పెట్టిందేదో ఇంత తింటూ కాలక్షేపం చేసేస్తోంది! ఈ రోజు నేను వాళ్ళమ్మతో వాదన పెట్టుకుని... మా ఇంటికి పూర్ణను తీసుకువెళ్ళి ఇలా రెడీ చేసి ఇక్కడకు వెంట బెట్టుకు వచ్చాను. నలుగురితో కలిసి కూర్చోవటానికి ఈ పూర్ణే మొహమాటపడింది!’’

‘‘అవునా....?’’ అంటూ గోదారమ్మ పద్మావతివైపు మెచ్చుకోలుగా చూసి పూర్ణ చేయి పట్టుకుని లాగి పక్కన కూర్చోబెట్టుకుంది.

ప్రవచనాలు చెప్పటం పూర్తయ్యాక అందరూ లేచి నిలబడ్డారు ఎవరింటికి వాళ్ళు వెళ్ళిపోవటానికి. గోదావరమ్మ పూర్ణ చేయి పట్టుకుని ‘‘మేం ఇద్దరం నీతో మీ ఇంటికి వస్తున్నాం...!’’ అంది.

పూర్ణ ఆశ్చర్యంగా చూస్తూ ‘‘ఎందుకండీ?’’ అనడిగింది.

‘‘నీ గురించి, మీ అమ్మా వాళ్ళతో మాట్లాడాలి’’ అందావిడ.

దారిలో గోదారమ్మ పూర్ణను అడిగింది. ‘‘అసలు జరిగిందేమిటో నువ్వు చెప్పమ్మా...!’’ పూర్ణం కొంచెంగా తలవంచుకుని ‘‘అందరూ అనుకునేదే నిజం కదమ్మా. నేను ప్రత్యేకించి చెప్పేది ఏముంటుందీ...? అయినా నా మాటల్ని ఎవరు నమ్ముతారూ...?’’ అంటూ నిట్టూర్చింది.

గోదారమ్మ పూర్ణ చేయి పట్టుకుని ‘‘అదేమిటమ్మా అలా అంటున్నావు. ఏదైనా నువ్వు చెబితేనే విషయం పూర్తిగా తెలుస్తుంది. అందరూ అనుకునేది ఎందుకూ... నీమాటలు మేం పూర్తిగా నిజమని నమ్ముతాం. చెప్పూ...’’ అంది.

‘‘మా ఇంట్లో వాళ్ళే నా మాటల్ని వినలేదండీ. అందుకే అలా అన్నాను. వాడు... అంటే... ఆ గోవిందు... రోజూ నా వెంటబడేవాడు. ఒకరోజు మాత్రం... మావాళ్ళకేదో అయిందని మాయమాటలు చెప్పి.... నన్ను తీసుకురమ్మన్నారంటూ తన బండి ఎక్కమని తొందరపెడితే... ఏం ఆలోచించకుండా బయలుదేరాను అతని

వెంట. ఊరుకు చివరగా ఉన్న అడవిలోకి తీసుకుపోయి తన ప్రేమ గురించి చెప్పటానికలా చేసానని అన్నాడు. నాకు కోపం వచ్చి అదేం జరగని పని అంటూ తిట్టాను. దాంతో వాడికి కోపం వచ్చేసింది కాబోలు మొహం మీద ఆసిడ్ పోస్తానంటూ బెదిరించాడు. అయినా నేను భయపడకుండా కోపం చూపించాను.. దాంతో వాడేం చేసాడంటే... నన్నో చెట్టుకు కట్టిపడేసి... ఆ రాత్రంతా అలా వేధించి...ఉదయం ఇంటికి పొమ్మని వదిలిపెట్టాడు. నాకేం అర్థం కాలేదు. ఇద్దరు స్నేహితులతో రాత్రంతా జాగారం చేస్తూ నా దగ్గరే ఉన్నాడు. అలా ఎందుకు చేసాడో ఆ తర్వాత నాకు తెలిసింది.

ఉదయమే వాడితో కలిసి... ఊళ్ళోకి వచ్చిన నన్ను కొందరు చూడటం జరిగింది. అదే వాడికీ కావాల్సిందని నాకు అనిపించింది. వాడి చేతిలో నాకు అత్యాచారం జరిగిందని అందరూ అనుకోవాలనీ, అపుడు గత్యంతరం లేక వాడినే నేను పెళ్ళిచేసుకుంటానని వాడి అభిప్రాయం అన్నమాట! వాడి మాటలే తప్ప నేనేం చెప్పినా ఎవరికీ నమ్మకం కుదరనట్లుగా చేశాడన్నమాట. నన్ను దక్కించుకోవటానికి అలాంటి ప్లాను వేశాడు.

అది బాగానే పనిచేసింది. వాడి ప్రచారమే నిజమని అందరూ నమ్మారు. చివరకు మా ఇంట్లోవాళ్ళు కూడా నా మాటల్ని నమ్మలేదు.

తర్వాత గోవిందు, తన తల్లిదండ్రుల్ని, పెద్దల్ని వెంటబెట్టుకుని పెళ్ళి మాటలకని మా ఇంటికి రావటం జరిగింది. జరిగిన తప్పుని అలా సరిదిద్దాలనుకోవటం వాళ్ళ గొప్పతనమంటూ మావాళ్ళు చాలా సంతోషించేశారు. ఆనందంగా ఒప్పుకున్నారు కూడా. కానీ..." అంటూ పూర్ణ ఆయాసపడుతూ ఒక క్షణం మాటలు ఆపింది.

''చెప్పమ్మా...'' అంది గోదారమ్మ అనునయంగా చేయి పట్టుకుని.

''నేను ఒప్పుకోలేదమ్మా. నా కిష్టం లేకపోయింది. ప్రేమించానని చెప్పటం వరకూ బాగానే ఉంది. ఒప్పుకోకపోతే, ఆసిడ్ పోసి నాశనం చేస్తానని బెదిరించటం ఎంతవరకూ సమంజసమో మీరే చెప్పండి.

వాడిని పెళ్ళిచేసుకుంటే... రోజూ వాడిని చూడాలిగా... ఆ మొహం చూసినపుడల్లా ఆ బెదిరింపు నాకు గుర్తుకు రాకుండా ఎలా ఉంటుంది? ఛీత్కారం కలగదూ... ప్రేమ ఎలా పుడుతుందీ...? అందుకే గట్టిగా వద్దన్నాను.

మా వాళ్ళకు బాగా కోపం వచ్చింది. ఎంత తిట్టినా నేను వినలేదు. దాంతో రెచ్చిపోయి నానా మాటలూ అన్నారు. సింగారించుకుని తిరగటం వలనే అబ్బాయిలు నా వెంటపడుతున్నారంటూ నిందారోపణ చేసారు. చెడ్డపేరు తెచ్చిన నన్ను ఇంట్లో పెట్టుకుంటే, మిగతా పిల్లలకు సంబంధాలు రావంటూ బెదిరించారు. అయినా నేను ససేమిరా అన్నాను.

'అయినా ఆ అబ్బాయికేం తక్కువ... కానీ కట్నం కూడా వద్దంటున్నారూ...?' అని మా వాళ్ళన్నారు.

'కట్నం వద్దన్నంత మాత్రాన ఓ పశువుని పెళ్ళాడటానికి నా మనసు అంగీకరించటం లేదు... పెళ్ళి కాకపోయినా ఫర్వాలేదు, చదువుకుంటానని' చెప్పాను.

దాంతో మా వాళ్ళు నన్ను దూరం పెట్టారు. బడికి వెళ్ళటం కుదరదని మానిపించేసారు. పిచ్చిదానిలా తయారు చేశారు. వేళకింత ముద్ద పెడుతున్నారు. అవమానాన్ని భరించలేక ఇల్లు వదిలి పోవాలని ముందు అనుకున్నాను గానీ ఆ అభిప్రాయం మార్చుకున్నాను.

బయటకు వెళ్తే... పరిస్థితులు ఎలా ఉంటాయో ఊహించాను. భయపడ్డాను!

కన్న ప్రేమతోనో, మరొకందువలనో పూర్తిగా కాదనుకోలేక... ఎలాగోలా ఇంట్లోనే ఉండనిస్తున్నారు. ఆ కాస్తంత ప్రేమనూ పోగొట్టుకోవటం విజ్ఞత కాదనిపించి... అలాగే పడివుంటున్నాను. జరిగిన దుర్ఘటన వల్ల మతి చలించిందని ప్రచారమూ జరిగింది. అలా అందరూ అనుకోవటం మా వాళ్ళకూ... బాగానే అనిపించింది. నేనూ వ్యతిరేకించకుండా అలాగే ఉండటం అలవాటు చేసుకున్నానమ్మా...!'

పూర్ణగొంతు రుద్ధమైంది.

వింటున్న గోదారమ్మకీ, పద్మావతమ్మకీ కూడా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

గోదావరమ్మ పూర్ణ చేయిని ఆప్యాయంగా నొక్కి ఆర్ద్రంగా చూసింది.

దగ్గరకు తీసుకుంటూ ''నువ్వు చాలా చక్కగా చేసావమ్మా! నీ ప్రవర్తనలో తప్పేంలేదు'' అంది.

పూర్ణ చేతిని మళ్ళీ ఆప్యాయంగా నొక్కి ''నీ అభిప్రాయాలు మెచ్చుకోతగ్గట్టుగా ఉన్నాయి గానీ తప్పు పట్టేందుకేమి లేదు...!'' అంది ప్రశంసిస్తున్నట్లుగా.

ఇంటికి వెళ్ళాక.... లోపలనుండి వచ్చిన తల్లికి గోదారమ్మను చూపిస్తూ పరిచయం చేసింది. ఆవిడను గోదావరమ్మ ఎపుడూ చూడలేదు. ఆవిడా అంతే.

''మీరు ఈ వూళ్లోనే టీచరుగా ఉద్యోగం చేస్తున్న సీత పెద్దమ్మగారని విన్నాను. ఆమెతోనే ఉంటున్నారటగా... అందరూ మీ గురించి గొప్పగా చెప్పుకుంటారు. వెతుక్కుంటూ మీరే  మా ఇంటికి రావటం చాలా సంతోషమండీ'' అందావిడ చేతులు జోడించి.

ఆవిడేదో గయ్యాళిలా తమమీద విరుచుకు పడుతుందని అనుకున్న గోదారమ్మకు ఆశ్చర్యంగా అనిపించింది.